# మనమిద్దరమే వుందాం

తెల్లారింది. ఊళ్ళో అందరికి మామ్మూలుగానే. ఒక్కలాగే. ఆ ఇంట్లో మాత్రం అద్భుతంగా తెల్లారింది. ఆనందంగా తెల్లారింది. చీకటి– వెలుగును సిగ్గుపడుతూ తొంగి చూసింది. "వచ్చావా తల్లీ! రామ్మా రా!" అంటూ యింటిల్లిపాదీ ఆహ్వానించినట్టు ఇల్లంతా ఆవరించి కూర్చుంది లేతవెలుగు.

"భళ్ళున తెల్లారింది లేవండర్రా!" అంటూ లేచింది యిల్లాలు కాంతమ్మ. ఆవిడ మొహం కలకల్లాడుతోంది. కళ్ళు సంతోషంగా మెరుస్తున్నాయి. "ఒరేయ్ చిన్నాడా! లేరా! ఎలా తెల్లారిపోయిందో చూడు!" అంటూ చిన్నకొడుకుని తట్టిలేపబోతే వాడే దిగ్గున లేచాడు "నే నెప్పుడో లేచిపోయానోచ్!" అంటూ పక్క మంచంమీదకి గెంతాడు.

"చిన్నక్కా! ఇంకా లేవ్వేమే? చూస్కో! నే నప్పుడే లేచి పోయా;" అంటూ చిన్నక్క చెవిలో కేకలెట్టాడు. ఆ పిల్ల రోజులా విసుక్కోకుండా, ముణగదీసుకుని పడుకోకుండా నవ్వుతూ లేచి కూర్చుంది. ఊడిపోయిన రిబ్బన్ను ముడెట్టుకుంటూ — "ఇవ్వాళ నేను బళ్లో కెళ్ళను" అంది.

"నేనూ వెళ్ళను—మరి అమ్మ తిడుతుందేమో?"

"తిడితే తిట్టింది. తిట్టుకోమను."

"ఒసే! తెల్లారిందా కబుర్లుకి? లేచి మంచాలెత్తు. రావుడూ! నువ్వు మొహం కడుక్కో! అన్నయ్య లేచాడేమో చూడు!" అంటూ హడావుడిగా పిల్లల్ని కేకలేసి నెమ్మదిగా మొగుడి మంచం దగ్గిరి కెళ్ళింది కాంతమ్మ. "ఏమిటీ? ఇంకా నిద్రే? ఇదేం చోద్యమమ్మా? భళ్ళున తెల్లారిపోతేనూ!" అంటూ సాగదీసి మళ్ళా హెచ్చరించింది.

"ఇదిగో! మిమ్మల్నే! తెల్లగా తెల్లారిపోయిందండీ!". ముసుగు మనిషి ఆవలిస్తూ లేచి కూర్చున్నాడు. "అబ్బ! ఎందుకే కాకిగోలా? ఎప్పుడో లేచిపోయా, ఊరికే అల్లా పడుకున్నాగానీ."

"ఉహుం! నాదే కాకిగోల. తెల్లారిందిగా పేరెట్టడానికి!" కాంతమ్మ రానికోపం నటిస్తూ వంటింటివే పెళ్ళిపోయింది.

ఇంట్లోవాళ్ళంతా లేచిపోయారు.

ఇల్లంతా సందడి సందడిగా వుంది. అందరికీ ఆనందంగావుంది. తల్చుకుంటోంటే వాళ్ళు పొంగిపోతోంది. భలేచుట్టాలొస్తున్నారు ఇంటికి. పద్మా! దాని మొగుడూను: "అబ్బ! ఎన్నాళ్ళ కెన్నాళ్ళకి!" అన్న ఆత్రుత ఆ ఇంట్లో ప్రతివాళ్ళ మొహాల్లోనూ కొట్టవచ్చినట్టు కన్పిస్తోంది.

కాంతాన్ని — రామ్మూర్తినీ తలిదండ్రుల్ని చేసిన అదృష్టం మొట్టమొదట పద్మకే దక్కింది. ఆనాడే పద్మ ఆ దంపతుల అన్యోన్యాన్ని చీలికలుచేసి తనోవాటా పుచ్చుకుంది. పద్మ—తండ్రి పోలికలతో, తల్లి ఛాయతో చిన్నప్పుడే చూడటానికి రెండుకళ్ళూ చాలనంత అందంగా

వుండేది. పద్మ తర్వాత హరీ—శకుంతలా—రామం వాటాల కొచ్చారు. అయినా పద్మ వాటా తగ్గలేదు. తల్లిదండ్రుల హృదయ సింహాసనం లోంచి ఒక్క పిసరుకూడా జరగలేదు. చెల్లెల్నీ, తమ్ముళ్ళని—తన చుట్టూ కూర్చోబెట్టుకుంది.

కాంతమ్మకీ—రామ్మూర్తికీ పిల్లలందరిమీదా ఒక్కలాంటి అభిమానమేవున్నా— పద్మంటే— "అది పెద్దపిల్ల" అనే ప్రత్యేకాభిమానం వుంది. తర్వాత వాళ్ళకికూడా అక్కయ్యంటే అర్థంకాని ప్రేమ! పద్మకి తమ్ముళ్ళన్నా—చెల్లెళ్ళన్నా—అమ్మన్నా—నాన్నన్నా – ప్రాణంలో ప్రాణం!

అలాంటి పద్మ ఆర్నెల్లనుండీ ఆ ఇంట్లో లేదు. ఒక వారం రోజులా? నెల్లాళ్ళా? ఆర్నెల్లనుంచీ పద్మ నెవ్వరూ చూడలేదు.

"అసలు పద్మతల్లికి పెళ్ళి చెయ్యకుండా వుండాల్సిందే. నిక్షేపంలా దాన్ని చదివించుకుంటే మన కళ్ళెదటే వుండేది" అని భర్త విచారించినప్పుడల్లా – భార్య నవ్వుతూ "చదువయ్యాక మాత్రం పెళ్ళి చెయ్యొద్దా? పెళ్ళి—కాపరం లేకపోతే దాని జీవితానికి మాత్రం సుఖమేమిటి!" అంటూ సాగదీస్తుంది.

ఎంత సరిపెట్టుకున్నా మనసు కుదుటపడక— "అసలు ఆడపిల్లల్ని కనటమే దురదృష్టం సుమండీ! పెంచినన్నాళ్ళూ పెంచి ఏ అయ్యకో అప్పజెప్పేస్తాం. వాడు కష్టపెడతాడో, సుఖపెడతాడో— అంతా దాని రాత! అయితే అదృష్టం—కాకపోతే ఖర్మను. అబ్బ! ఏమిటో గుండెలు పెరుక్కుని యిచ్చేసినట్టుంటుంది. పెద్దపిల్ల మొగపిల్లాడు ఆయితే మనింట్లోనే వుండేదికాదూ?" అనుకుంటూ భార్య బాధపడినప్పుడల్లా—"నీ పిచ్చిగానీ అందరూ మొగపిల్లల్ని కంటే ఇక ప్రపంచం ఎలా నడవాలి? బాధలేకపోతే ఆనందమేముంది? ఎక్కడోపుట్టి, ఎక్కడో పెరిగి నువ్వు నన్ను వెతుక్కుంటూ రాలా! అలాగే మన పిల్లాను? దానికేంలోటు? దర్జాగా వుంది. ఎప్పుడు బుద్ధిపుడితే అప్పుడు వస్తూవుంటుంది. వెల్తూ వుంటుంది. కన్యాదానంచేసి పుణ్యం సంపాదించుకోమన్నారు పెద్దలు ఎందుకను

కున్నావ్? ఈ విచారం మర్చిపోవటానికే మరి" అంటూ బుజ్జగిస్తోన్నట్టు నచ్చచెప్పాడు భర్త. ఇద్దరికీవున్న తృప్తేమిటంటే పద్మకి మంచి భర్త దొరికాడు. అత్తారింట్లో సుఖంగా వుందని.

జనార్దన్ బంధువుల పెళ్ళిలో పద్మని చూశాడు.

అతనికి పద్మ ఎంత నచ్చిందంటే — అసలు పద్మని పెళ్ళి చేసుకోకపోతే తన జీవితం వ్యర్థం అనుకున్నాడు. అంతే!

పెళ్ళి కబుర్లు జరిగాయి.

జనార్దన్ ఎమ్. ఇ. పాసై లెక్చరర్‌గా చేస్తున్నాడు. నల్లగా — అందంగా — ఆరోగ్యంగా వుంటాడు. తల్లిదండ్రులు వున్నారు. ఒకే ఒక చెల్లెలుంది. వెనక ఏవేవో ఆస్తిపాస్తులున్నాయి. కుర్రాడు మంచివాడని నమ్మకంగా తెలిసింది.

రామ్మూర్తికీ, కాంతమ్మకీ మతిపోయింది. సంతోషంతో ఉక్కిరి బిక్కిరయ్యారు. పద్మ మొహంమీద లక్ష్మీకళ తళతళ లాడుతోన్నట్టు కనిపించింది. కళమాట ఎలావున్నా అతిశయం తొంగి తొంగి చూసింది ఆ అందమైన మొహంలోంచి. పెళ్ళి కబుర్లలో – కట్నాల ప్రసక్తి అంతగా రాలేదు. మాకు ఇంత కావాలని నొక్కించి అడగలేదు మొగపెళ్ళివారు.

"మీ పిల్లకి మీరేం పెట్టుకుంటారో! మేము చెప్పటం ఎందుకూ? అంది పెళ్ళికొడుకుతల్లి గడుసుతనంగా.

"మా శక్తికొద్దీ చేస్తాం వదినగారూ!" అంది కాంతమ్మ వినయంగా.

సంబంధం కుదిరిపోయింది. లగ్నం పెట్టేశారు. రామ్మూర్తి నిజంగా శక్తికొద్దీ చేశాడు. శక్తికిమించికూడా చేశాడు. అప్పుచేసి ఘనంగా పెళ్ళిచేశాడు. పెళ్ళివారు మొహాలు అటూ ఇటూ పెట్టుకోకుండా సాధ్యమైనంతవరకూ సంతోషపెట్టాడు.

"మన దరిద్రం ఎప్పుడూ వుండేదే! ఏదో పూర్వజన్మ సుకృతం

కొద్దీ దానికి మంచి సంబంధం వచ్చింది. దాన్నయినా సుఖపడనీ!" అనుకున్నారు భార్యాభర్తలు.

పెళ్ళి పెళ్ళిలా అయిపోయింది— సంబరంగా. అలుడికి మనుగుడుపులూ అయ్యాయి. రోజులు ఎలా గడిచాయో తెలీకుండా గడిచిపోయాయి. బయల్దేరేప్పుడు అల్లుడు తనతోపాటు పెళ్ళాన్ని తీసుకుపోతానన్నాడు.

"అప్పుడేనా? అప్పుడే కాపరానికి పంపేస్తామా? మూడోనెల్లో సారే చీర పెట్టి"....ఏకరువు పెట్టింది అత్తగారు.

"పెట్టినవన్నీ చాల్లెండి ఇంకా మీకు పెట్టాలనివుంటే మూడోనెల్లో అవన్నీ పట్టుకురండి" అన్నాడు అల్లుడు నవ్వులాటలోకి దించుతూ.

"అప్పుడే వెళ్ళటం ఏమిటి? మూడోనెల్లో వస్తానని మీ ఆయనికి చెప్పరాదూ?" అంది కాంతమ్మ వుండబట్టలేక కూతురితో.

పద్మ సిగ్గుపడిపోయిందేగానీ – మాట్లాడిందే కాదు. పెళ్ళి అయిన పదిరోజుల్నాటికే పద్మ మొగుడితో వెళ్ళిపోయింది.

వెళ్ళేముందయినా అమ్మనీ – నాన్ననీ – తోడబుట్టినవాళ్ళనీ చూసి బావురుమనలేదు. ఇరుగు పొరుగు వాళ్ళనీ, స్నేహంగా వుండే పిల్లల్ని చూసి దిగాలు పడిపోలేదు. ముసిముసి నవ్వులు నవ్వుతూ, సిగ్గుపడుతూ బండెక్కి కూర్చుంది మొగుడి ప్రక్కన.

కాంతమ్మ కూతురికేవేవో సర్దుతూనేవుంది. మూటలు కడుతూనే వుంది. బండిలో చేరవేయిస్తూనేవుంది. చివరి కెలాగో ఇంట్లోంచి తెముల్చుకుని బయటపడింది.

"అమ్మా" అని కూతురు తననిచూసి బిక్కమొహం వేస్తుందేమో ఓదార్చుదామనుకొంది. "పద్మా! అన్నీ సర్దిపెట్టుకున్నావుగదూ! జాగ్రత్త సుమీ! రైల్లో... జాగ్రత్త!.... వెళ్ళగానే ఉత్తరంరాయి. ఏవీ బెంగ పెట్టుకోకు" గబగబా చెప్పింది.

"పద్మ అన్నిటికీ తలూపింది.

బండి కదిలి వెళ్ళిపోతూంటే వెర్రిదానిలా చూచింది కాంతమ్మ. ఇంటినిండా బిలబిల్లాడుతోన్న జనంమాట గుర్తులేదు

పుట్టెడు దుఃఖం వొచ్చేసింది. బావురుమని ఏడ్చెయ్యబోయింది. ఎలాగో తమాయించుకుంది. సాటివాళ్ళ హాస్యాలతో కాస్త తేరుకుంది. గంటలు గడుస్తోన్నకొద్దీ మనస్సు బాగా తేలికపడింది. రోజులు గడుస్తోన్నకొద్దీ మిగతా పిల్లల మంచిచెడ్డలు చూసుకోవటంలో మునిగిపోయింది.

* * *

పద్మ పెళ్ళినాటికి హరి స్కూలుఫైనల్ పరీక్షలు రాశాడు. పద్మ వెళ్ళిపోయింతర్వాత రిజల్ట్సు వచ్చాయి. పాసయ్యాడు.

మార్కులు కూడా చాలా బాగా వచ్చాయి.

వాడి చదువు మాటేమిటని రామ్మూర్తీ, కాంతమ్మా వారంరోజులు ఏకవరసగా ఆలోచించారు.

నెల్లాళ్ళ క్రిందట పెళ్ళికోసం అప్పుచేశారు. ఇప్పుడు మళ్ళీ కొడుకు చదువుకోసం అప్పుచెయ్యాల్సిందేనా ?

ఇదంతా ఎలా తీరేట్టు?

పద్మ పెళ్ళికి అంత అప్పు అవ్వకుండావుంటే హరి చదువు గురించి వెనకాడాల్సిన పని ఉండేదికాదు.

"తెలివితక్కువ పనిచేశాం కాంతం? వెనకాల సంగతి ఆలోచించకుండా ఖర్చుపెట్టాం. ఆ పిల్లాడెలాగూ మనపిల్లని చేసుకోవటానికి సిద్ధపడే వున్నాడు. ఓ పదిమందికి భోజనాలెట్టి—నాలుగక్షింతలేసి అయిందనిపించెయ్యాల్సింది" అన్నాడు రామ్మూర్తి కొంచెం పళ్ళుచెత్తాప్పడుతూ.

కాంతమ్మ అడ్డం వచ్చింది— "అదేంమాట? వాళ్ళు కట్నం కక్కమంటే నాలుగువేలన్నా అయ్యేది. చచ్చినట్టు యిచ్చేవాళ్ళం. మా పిల్ల అందగత్తెమ్మా అని అతీగతీలేనట్టుగా అంటగడితే ఏంబావుంటుంది? ఏదో అత్తకట్నం, ఆడబిడ్డ కట్నం, మంచీ చెడ్డా అవుతాయిమరి. వాళ్ళ

అందచందాలన్నీ జరిపాం కాబట్టి పిల్లని మర్యాదగా చూసుకుంటున్నారు. లేకపోతే...."కూతురుపడే కష్టాలన్నీ తప్పిపోయాయని సంతోషించింది.

"ఇంతకీ హరి సంగతి ఏం చేద్దాం?"

"బావుందండీ! నేనేం చెప్పనూ? ఎలా బావుంటుందనిపిస్తే అలా చేస్తే సరి. అయినా వాణ్ణికూడా అడగరాదూ?"

తర్వాత రామ్మూర్తి కొడుకు నడిగాడు.

అడగటంకన్నా తనే చెప్పాడు—"నువ్వు కాలేజీలో చేరినా నాలు గయిదు సంవత్సరాలు చదివేవరకూ అంతూ దరీ వుండదు. అప్పుడైనా దొరికేది గుమాస్తా వుద్యోగమే.

"నే నే మనుకుంటున్నానంటే—నీక్కూడా యిష్టపడితేనే అనుకో, లేకపోతే తల తాకట్టుపెట్టయినా నిన్ను కాలేజీలో చేర్పించేస్తాను. ఎన్నాళ్ళు వీలైతే అన్నాళ్లే చదువుకోవచ్చు. దానికన్నా మంచి దారేమిటంటే ప్రస్తుతాని కేదయినా ట్రైనింగ్‌కెళ్ళి తర్వాత ప్రయివేటుగా చదువుకోవచ్చు. నీకూ నాకూ కూడా సుఖంగా వుంటుంది" అన్నాడు. తండ్రి మొహంలో మంచితనంచూస్తూ హరి వెనక ముందాడలేదు. "అలాగే నాన్నా!" అన్నాడు.

"కాలేజీలో చేరటం లేదని నీకేం బెంగగా వుందా?"— తండ్రి ఓదార్పుగా అడిగాడు. హరి కొంచెం సిగ్గుపడ్డవాడిలా నవ్వి - "ఊహూ! తర్వాత చదువుకోవచ్చన్నావుగా?" అన్నాడు.

రామ్మూర్తి బరువెక్కిన గుండెలతో మాట్లాడలేకపోయాడు.

హరి, టీచరు ట్రైనింగులో చేరి నాలుగు నెల్లయింది.

అప్పుచేసి పద్మకి పెళ్ళిచేసినందుకు తర్వాత రామ్మూర్తి ఎప్పుడూ విచారించలేదు.

పద్మ ఆషాఢ మాసంలోకూడా రాలేదు. జనార్దన్ ఆషాఢ మాసం అంతా సెలవుపెట్టి పెళ్ళాన్ని తీసుకుని వూళ్ళమీదకి బయల్దేరాడు. చూడా లనుకున్న వూళ్ళన్నీ తిరిగ్గా చూసి—నాలుగయిదు రోజులు మిగిలివుంటే ఓ స్నేహితుడింట్లో గడిపేశాడు.

పద్మని చూడాలని కాంతమ్మ కలవరించడం మొదలు పెట్టింది. రామ్మూర్తి అల్లుడిపేరా, వియ్యంకుడిపేరా నాలుగయిదు గొలుసు ఉత్తరాలు రాశాడు వారం రోజుల్లో.

రెండు వారాలకి తీరిగ్గా ఒక కార్డుముక్క వచ్చింది వియ్యాలవారి దగ్గిర్నుంచి — మీ అల్లుడూ కూతురూ ఫలానారోజు వస్తున్నారని.

ఇంట్లోవాళ్ళ సంతోషానికి అంతులేదు.

"పద్మతల్లి వస్తోంది. ఎలా వుందో! చూసి చాన్నాళ్ళయింది" అనుకున్నాడు తండ్రి. "పెద్దపిల్ల వస్తోంది. బెంగపెట్టుకుని చిక్కిపోయిందేమో" అనుకుంది తల్లి. "అక్కయ్య వస్తోంది. మా అక్కయ్య వస్తోంది" అని సంబరపడిపోతూ తెలిసినవాళ్ళందరికీ చెప్పి వచ్చారు చిన్నవాళ్ళు.

నిజంగా పద్మతోపాటు వాళ్ళాయనకూడా రావటం ఆ యింట్లో ఎవరికి అంత బాగా ఇష్టంలేదు. అతగాడొచ్చాడంటే పెళ్లాన్ని రెండు రోజులో, మూడు రోజులో వుంచి తీసుకుపోతాడు. ఆ వున్న నాలుగు పూటలూ యిద్దరూ గదిలో దూరి కూర్చుంటారు.

సిగరెట్టు దగ్గర్నుంచీ అన్నీ అందిస్తూ గంటలతరబడీ అక్కడే కూర్చుంటుందిగానీ బయటికి వూడిపడదు. పెళ్ళిలోవున్న వారం రోజులూ పద్మ మొహం చూద్దామంటే కన్పించేదికాదు. ఇప్పుడలా చెయ్యదులే. ఆర్నెల్ల తర్వాత పుట్టింటి మొహం చూస్తోంది. దానికి మాత్రం అందరితో మాట్లాడాలని వుండదా?

* * *

పద్మావాళ్ళు వచ్చే ఆ ఫలానారోజు.... భళ్ళున తెల్లారింది. ఆ యింట్లో అందరికీ మహదానందంగా తెల్లారింది.

కాంతమ్మ పద్మ కిష్టమైన కందిపచ్చడీ, బెల్లం పులుసూ ఏవేవో చేసింది. పరమాన్నం వండింది. ఇల్లూవాకిలీ తీర్చిదిద్ది వుంచింది.

హరి స్టేషన్ కెళ్లాడు — శకుంతలా-రామూ కూడ బడి ఎగ్గొట్టి అన్నయ్యకోసం వెళ్లారు.

పద్మ ఒక్కతే వచ్చింది —

"బావగారేరీ?" అన్నాడు హరి ఎగాదిగా చూస్తూ.

"రాలేదు. సెలవు దొరకలేదు" అంది పద్మ. చిన్నవాళ్ళని చూచి నవ్వింది. గబగబా బేగ్‌లోంచి ఏవో తీసి యిచ్చింది తినటానికి.

అంతా యింటికొచ్చారు.

పద్మని చూస్తూంటే నోటంట మాట రాలేదు కాంతమ్మకి.

"బావగారు రాలేదమ్మా! సెలవు దొరకలేదట" అన్నాడు హరి.

కాంతమ్మ మనసు పొంగిపోయింది—"అదేమిటే? ఇద్దరూ వస్తున్నారని రాశారే!" అంది పైకి.

పద్మ మొహం ముడుచుకుని—"ఏమో! సెలవు దొరకలేదుట. పోనీ నేనూ మానేద్దామనుకున్నాను" అంది.

కాంతమ్మ తెల్లబోయింది. "మానేదామనుకున్నావా? మంచిదానివే మరోసారి అతనే వస్తాడు. మనింటికి రావటానికి నీకేం సిగ్గా ఏమిటీ? పద లోపలికి. శకుంతలా! కుంపట్లో కాఫీ వుంది. తెచ్చి అక్కయ్యకియ్యి" — అంటూ పురమాయించి పద్మ పెట్టి లోపలికి తీసుకొచ్చింది కాంతమ్మ.

పద్మ కొంచెం ఒళ్ళు చేసింది. ఛాయకూడా పచ్చబారింది. చెవులకి దుద్దులు తీసేసి రింగులు పెట్టుకుంది. జడకి రిబ్బన్నులేదు. ఏదో కొత్త రకం సిల్కుచీర కట్టుకుంది. కుడిచేతికి తాళంకప్పంత వాచీవుంది. మనిషి ఎవరోలా వుంది.

పద్మ కాఫీతాగి స్నానం చేస్తానంది.

గబగబా వేన్నీళ్ళు తోడిపెట్టింది కాంతమ్మ.

పద్మ స్నానంచేస్తూ — "అమ్మా! నా పెట్లో కొత్త సబ్బుంటుంది చూడు, శకుంతల్నిలా తెమ్మను!" అంటూ కేకపెట్టింది.

"అక్కడ గూట్లో ఎర్ర సబ్బుందమ్మా సరిగ్గా చూడు."

ఛీ! ఇది నా కొద్దు బాబూ! గజ్జి కంపూ యిదీనూ .... నా పెట్లో...."

"తాళం వేసివుందే పెట్టికి. పోనీ సున్నిపిండివ్వనా?"

"ఉహూ! తాళంచెయ్యి బ్యాగ్‌లోవుంది" చెప్పటం మర్చిపోయా."

కాంతమ్మ చేతిలో పని వొదిలేసి బేగ్‌లో సామానులన్నీ గుమ్మరించి తాళం చెయ్యి వెదికీ — పెట్టెతీసి సబ్బుబిళ్ళ పట్టుకునేసరికి పది నిమిషాలు దాటింది.

పావుగంటకి స్నానంచేసి బయటకొస్తూ సబ్బుపెట్టె తెచ్చి బేగ్‌లో పెట్టుకుంది పద్మ. పెంట్లోంచి తలనూనె తీసి తలకు రాసుకుంది. అద్దం దువ్వెనా తీసి తల దువ్వుకుంది. సెంటు సీసా తీసేసరికి "అక్కయ్యా! నాకు....నాకు...." అంటూ ఎగబడ్డారు చిన్నావాళ్ళు. తను బట్టలనిండా రాసుకుని వాళ్ళకా వేలు అంటించింది. పద్మ అత్తారింటికి వెళ్లేటప్పుడు స్నోలూ-పౌడర్లూ-సెంట్లూ అన్నీ పట్టుకెళ్ళింది. ఇవన్నీ కొత్తవాటిలా కనుపడుతోంటేనూ-

"నువ్వు తీసికెళ్ళినవన్నీ అయిపోయాయిటే?" అంది కాంతమ్మ.

పద్మ పెట్లో అన్నీ పొందిగ్గా సర్దుకుంటూ – "బావుంది. అవెన్నాళ్ళు వస్తాయ్?" అంది.

"సరేగాని లేచిరా! ఓ ముద్ద తిని .... కాస్సేపు పడుకో. మళ్ళా జానకీ వాళ్ళు వస్తారేమో! నిన్ను చూడాలని తెగ కొట్టుకుంటున్నారు" అంది కాంతమ్మ.

నలుగురి పిల్లలకి ఒక్కసారే అన్నాలు పెట్టేసింది. పద్మ కంది పచ్చడితో ఒక ముద్దతిని తీసేసింది. మిగిలిన కూరలు కూడా సరిగ్గా

తినలేదు. "అదేవిటే?" అని కాంతమ్మ విస్తుపోతోంటే వినిపించుకోకుండా పెరుగు వేసేసుకుంది.

పద్మ తిండి కాంతమ్మకేవీ రుచించలేదు.

"మన యిల్లూ మన కూరలూ అన్నీ మర్చిపోయావుటే?" అంది దిగాలుపడి.

"అబ్బ! అన్నిట్లోనూ వుప్పెక్కువై పోయిందమ్మా!"అంది పద్మ చెయ్యి కడుక్కుంటూ.

కాంతమ్మ కూడా రెండు మెతుకులు పెట్టుకుంది. "పద్మా! మీ అత్తారి కబుర్లేవిటే? ఏవీ చెప్పావు కావు". అన్నం తింటూ అభిమానంగా అడిగింది కూతుర్ని. "ఏవున్నాయ్? అంతా బాగానే వున్నారు. అబ్బ! నిద్రొస్తోంది. కాస్సేపు పడుకుంటానమ్మా!" అంటూ లేచింది పద్మ.

* * *

"పద్మా! కాఫీ తాగావుటే? మూడైపోయిందీ" అంటూ అరగంట నుంచీ పాట పాడతోంటే నెమ్మదిగా కళ్ళు విప్పింది పద్మ.

"మధ్యాహ్నం కాఫీ ఏవిటమ్మా! టీ తాగుతాం మా ఇంట్లో—" అంది బద్ధకంగా ముడుచుకు పడుకుంటూ!

కాంతమ్మ కొంచెం తెల్లపోయింది. దిగాలుపడి చూసింది.

"మీ యింట్లో తాగితే సరేలే. మనింటో టీ పొడి లేదుకదమ్మా! శకుంతలా—రామూనూ బళ్ళోకి పోయారు మధ్యాహ్నం."

"తర్వాత తాగుతాలే! టీ అలవాటైపోయిందమ్మా! లేకపోతే తల నొప్పొస్తుంది" అంది పద్మ కళ్ళు మూసుకునే.

కాంతమ్మ పక్కింటివాళ్ళ పిల్లాణ్ణి పిల్చి టీ పొట్లాం తెప్పించి టీ కలిపింది. అప్పటికి పద్మ లేచి మొహం కడుక్కుని మళ్ళా జడ వేసుకుంది. టీ తాగి కక్కుకోబోయినంత చిరాకు పడిపోయి మళ్ళా పడుకుంది.

కాంతమ్మ కెందుకో అనుమానం వచ్చింది. కూతుర్ని ఎగాదిగా చూసింది. ఎలా అడగాలో సిగ్గేసింది. మొహంమీద నవ్వు తొణికిసలాడింది. అనున యంగా అడిగింది "పద్మా! నీ ఒంట్లో బాగాలేదా ఏమిటే?"

పద్మ తలగడలోకి మొహం పెట్టేసుకుంది– "ఊహూ! నాకేం? బాగానేవుంది."

"చెప్పూ! నా దగ్గిర సిగ్గెందుకూ? నెలగాని తప్పిందా? నిన్ను చూస్తోంటే అల్లాగే వుంది."

పద్మ మాట్లాడలేదు. సిగ్గుపడిపోయినదానిలా నవ్వింది. కాంతమ్మ కడుపు వెన్నెల సముద్రం అయిపోయింది. బిడ్డమీద పుట్టెడు అభిమానం ముంచుకొచ్చింది– "నీ కడుపు బంగారం గానూ! ఇంతసేపు ఆ కబురే చెప్పవుటే? ఎన్నో నెలా?"

"ఏమో! నాకు తెలీదు బాబూ!"

కాంతమ్మ నవ్వింది– తర్వాత అదే చెపుతుందని అక్కణ్నుంచి లేచిపోయింది. ఎర్ర సబ్బువాసన నచ్చకపోవటానికీ– కందిపచ్చడి తినక పోటానికీ కారణం తెలిసిపోయాక కాంతమ్మ మనస్సు తేలిక పడింది. సంతోషంతో నిండిపోయింది.

"పిల్లకి నెల తప్పనే తప్పింది. ఎంత... ? చూస్తోండగానే నెలలు నిండుకొస్తాయి. మనవడో, మనవరాలో — కాంతమ్మకి హఠాత్తుగా మరో పదేళ్ళ వృద్ధాప్యం – గాంభీర్యం మీదపడ్డాయి.

తల్చుకు తల్చుకుని తనలో తనే పుక్కిలింతలుగా నవ్వుకుంది. వంటింట్లో అటూ యిటూ తిరిగింది. మళ్లా పద్మ దగ్గిరి కొచ్చింది ఏదో సెపంమీద— ఎన్నో నెలంటే చెప్పావే కావేమే? రెండు నెలలు వెళ్లాయా?"

పద్మ సిగ్గుపడుతూనే ఊ కొట్టింది — "ఊఁ."

"పోనీ మీ అత్తగారైనా ఓ కార్డుముక్క రాయకూడదూ?" యాదాలాపంగా అంది కాంతమ్మ.

"రాస్తానన్నారు మరి" అని వూరుకుంది పద్మ.

"అత్తయ్యా, పద్మ వచ్చిందటకదూ? శకుంతల కనపడితే అడిగాను" అంటూ వచ్చింది జానకి. వస్తూనే పద్మని చూసింది. "అబ్బో! ఒ స్త్రీ పిల్లయిపోయిందండోయ్!" అంటూ వేళాకోళం చేసింది.

పద్మ, జానకీ చాలా చనువుగా వుండేవాళ్ళు. కాంతమ్మ వంటింట్లోకి వెళ్ళి పనుల్లో పడింది.

పద్మ జానకితో తెగ మాట్లాడుతోంది. గంట కొట్టినట్టి వినిపిస్తున్నాయి వంటింట్లోకి. మొగుణ్ణి గురించి చెప్తోంది. అత్తగార్ని గురించి చెప్తోంది. వాళ్ళ యింటి గురించి వర్ణిస్తోంది.

కాంతమ్మ ఎసరుపెట్టి కూరలేవో తరిగి మళ్ళా పద్మావాళ్ళ దగ్గిరకెళ్ళింది. "పద్మా! సాయంత్రం అన్నంలోకి పెసరట్టు తింటావుటే? వేడిగా వేసి పెడతానూ" అంది.

"ఒద్దులేమ్మా! ఇప్పుడెందుకూ?"

"ఏం? నీకు నయించదా? మీ అత్తగారేం వంటలు వండి పెట్టేదో గాని, ఇక్కడి తిళ్ళనీ మర్చిపోయినట్టున్నావు."

"వాళ్ళత్తగారు చాలా మంచిదట అత్తయ్యా!" అంది జానకి.

"ఏమోనమ్మా! నే నడిగితే ఏవీ చెప్పిందికాదు. అన్నట్టు మీ యింట్లో వంటెవరు చేస్తారే?" కుతూహలంగా అడిగింది కాంతమ్మ.

పద్మ తలగడమీద వేళ్ళతో గీతలు గీస్తూ చెప్పింది.

"ఆవిడే చేస్తారు? నన్నేపనీ ముట్టుకోనివ్వరు. ఇంట్లో ఎప్పుడూ ఓ పనికుర్రాడుంటాడు. పనిమనిషి ఎలాగూ వస్తుంది. పన్నెండు రూపాయలిస్తాం దానికి. బట్టలవీ అదే వుతుకుతుంది. నన్ను తలకూడా అంట్లుకో

నివ్వదు. మా పనిమనిషే అంటుతుంది. ఎంతసేపూ రేడియో వింటూ కూర్చుంటాను. లేకపోతే పుస్తకాలవీ చదువుకుంటాను. సాయంత్రం మేమిద్దరం సినిమాకో, పార్కుకో వెళ్ళిపోతాం" ఇంకేం చెప్పాలో తోచక వూరుకుంది పద్మ.

కూతురు అంత సుఖపడుతోందంటే చాలా సంతోషంగానేవుంది కాంతమ్మకి. అయినా ఎందుకో కడుపంతా కలచినట్టయింది. పిచ్చిగానీ, పద్మకింకా అమ్మా, నాన్నా, ఈ పేదవాళ్ళ పాట్లూ ఇంకా ఎక్కడ గుర్తున్నాయి?

పద్మ పెట్టెతీసి జానక్కి కొత్తగా కొనుక్కున్న చీరలు చూపించింది. తనూ మొగుడూ తీయించుకున్న ఫొటోలు చూపించింది. కాంతమ్మ వుండబట్టలేక ఫొటోలవీ చూసింది. సంతోషించింది.

సాయంత్రం రామ్మూర్తి శ్రమంతా మర్చిపోయి వుత్సాహంగా వచ్చాడు. కూతుర్ని చూశాడు. కన్నుల పండుగలా వుంది.

"బాగున్నావా అమ్మా" అన్నాడు పొంగిపొర్లే అనురాగంతో.

పద్మ కొంచెం నవ్వి తలదించుకొని సిగ్గుపడుతూ తలూపింది.

"మీ ఆయనకూడా వస్తానన్నాడే!"

"రాలేదు. సెలవు దొరకలేదు."

"పోనీలే. ఏంచేస్తాం మరి? మీ అత్తగారూ వాళ్ళూ బావున్నారా?"

కుశల ప్రశ్నలన్నీ అయ్యాయి.

"అసలు కబురు తెలిస్తే ఇంకెంత మురుస్తారో మీరు" అంటూ కాఫీ అందించింది కాంతమ్మ.

పద్మ లోపలికి తప్పుకుంది.

"కబు రేమిటి?"

"ఇంకేముంటుంది? మీ నెత్తెక్కి చెవులు మెలెయ్యటానికో కుర్రసన్యాసి పుడతాడు లెండి."

"ఆహా! నిజమే! ఎన్నోనెలా? ఒంట్లో కులాసాగా వుందా?"

ఇద్దరూ బాగా పెద్దవాళ్ళయిపోయి, పుట్టబోయే కుర్రవెధవని మధ్య పెట్టుకుని వేళాకోళా లాడుకున్నారు.

"నా చెవులెందుకు మెలేస్తాడూ? నీ కొప్పట్టుకు లాగుతాడుగానీ" అన్నాడు రామ్మూర్తి.

"ఆఁ అదీ చూద్దాం. ఇంకెన్నాళ్ళూ? నాలుగునెలలు కళ్ళు మూసుకుంటే సరి. ఏడోనెల జొరబడగానే పురిటికి తీసుకురావాలి. తల్చుకుంటేనే నా కాళ్ళు వణుకుతున్నాయి. ఈ గండం ఎలా గడిచి గట్టెక్కుతుందో!"

"చేతికి సాయంగా కామాక్షి వదిన్ని రమ్మని వుత్తరం రాయాలి సుమండీ!"

రామ్మూర్తి నవ్వాడు. "ఏమిటలా గాభరా పడిపోతున్నావ్? ఇంకా ఏడునెల్ల మాట కదా?"

"ఆఁ ఎంతలో వస్తాయి? దొర్లుకుంటూ వస్తాయి. రేపు వదినకో ఉత్తరం రాసి పడేద్దురూ! పద్మకి నెలతప్పిందనీ — పురుడుకాస్తా ఆవిడ చేతులమీదే పొయ్యాలనీ నేను రాసినట్టు రాసి...."

"రాస్తాలే. బజారు కెళ్తాను, ఏమైనా తేవాలా?"

"ఏం తెస్తారు? ఏం చెప్పినా దొరకవంటారు. ఇంకేం చెప్పనూ? అన్నట్టు టీ పొట్లాం ఒకటి కావాలి. పద్మకి అలవాటైందట. శనగపప్పు తెస్తారా?"

"ఎక్కడ ఎత్తుకురానూ?"

"అయితే అయింది. బ్లాకులోనే కొనితెద్దురూ! పద్మకి బొబ్బట్లంటే ప్రాణం. తెగ తింటుంది."

రామ్మూర్తి బజారు కెళ్ళిపోయాడు.

శకుంతలా, రామూ బళ్ళోంచి వచ్చేశారు.

"అక్కయ్య దగ్గిర ఫొటో లున్నాయి చూడండర్రా" అంది కాంతమ్మ వంటింట్లో కెళుతూ.

"ఫొటోలా? చూపించక్కయ్యా!" అంటూ పద్మమీద పడ్డారు పిల్లలు.

"అన్నీ సర్దిపెట్టేశానర్రా. ఇప్పుడు కాదు. రేపు చూపిస్తాలెండి" అంది పద్మ బద్ధకంగా.

చిన్నవాళ్ళిద్దరూ చిన్నబోయారు.

"పోనీ రేపు చూపిస్తుందిలెండి. ఇలారండి పెసరట్టు ముక్కలు పెడతాను" అంటూ పిల్చింది కాంతమ్మ.

• • •

పద్మ వచ్చి వారం రోజులయింది.

పద్మ ధోరణి బాగా ఆకళింపైపోయింది కాంతమ్మకి.

మొదట్లో "ఏమోలే" అని సరిపెట్టేసుకుందిగానీ — రాను రాను సర్దిచెప్పుకోలేకపోయింది.

చిన్నవాళ్ళిద్దరూ ఫొటోలు చూపించమని ఎంత అడిగినా "మీరేం చూస్తారు? చేతులుపెట్టి పాడుచేస్తారు" అందోసారి. "తర్వాత చూపిస్తాలెండి" అంది ఇంకోసారి. రెండురోజులవరకూ చూపించిందేకాదు.

ఓసారి పద్మ స్నానం చేస్తోంటే శకుంతల పెట్టెతీసి ఫొటోలు బయటికి తీసేసింది. "నేను ముందు చూస్తానంటే నేను ముందని దెబ్బలాడుకోవటంతో రహస్యంకాస్తా బయట పడిపోయింది."

పద్మ బట్టలు చుట్టబెట్టుకుని గబగబావచ్చి "ఎవరు చెప్పారే నీకు నా పెట్టి తియ్యమనీ? వెధవ్వేషం! పళ్ళు రాలగొడతాను" అంటూ చెల్లెల్ని లెంపకాయ కొట్టినంత పనిచేసి ఫొటోలు వూళ్లాక్కుంది.

శకుంతల బిక్కమొహంవేసి వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టింది. కాంతమ్మ గబగబా వచ్చింది. "ఏదో సరదాకొద్దీ తీసింది. దాన్నెందుకే అలా కేకలేశావు పద్మా!" అంది నిష్ఠూరంగా.

"కేకపోతే చూడమ్మా! పెట్టంతా ఎలా కెలికేసిందో! ఫోటోలవీ మచ్చలుపడితే ఆయన విసుక్కుంటారు."

"అయితే అవేవో మీ ఇంటిదగ్గరే పెట్టుకురాలేక పోయావా? ఇక్కడి కెందుకు తెచ్చావూ? అయినా దాని పెట్టి ముట్టుకోవటం నీకేం పొయ్యేకాలమే? కొత్తబట్టలవీ అద్దంలా సర్దుకుంది. ఇంకా ఏమి టేమిటో వుంటాయి. అవన్నీ పాడుచేస్తే దానికి చికాకు కాదూ? చాలు గానీ ఫో—అవతలకి" అని చిన్నకూతుర్ని కసిరింది కాంతమ్మ. శకుంతల బిక్కచచ్చి వెళ్ళిపోయింది.

పద్మ తనొచ్చిన రెండోరోజు పొద్దున్నంతా కూర్చుని ఏమిటో ఓ గంటసేపు రాసింది.

చద్దన్నం తినటానికి పీటమీద కూర్చున్న తమ్ముణ్ణి పిల్చింది.

"ఒరే రామూ! ఈ వుత్తరం కొంచెం పోష్టులోవేసి వచ్చేద్దూ!"

"అన్నం తింటున్నా నక్కయ్యా!"

"తర్వాత తిందువుగాని."

"అన్నం తినేసి బళ్లో కెళ్ళిపోతాగా? అప్పుడు తీసుకుపోయి డబ్బాలో పడేస్తాను."

"ఆలశ్యం అయితే పోస్టు వెళ్ళిపోతుందేమో! అప్పుడే తొమ్మిది దాటింది. ఫర్వాలేదు. ఒక్కసారెళ్ళి వచ్చేద్దూ ఓ పదిపైసలిస్తాను. కొనుక్కుందువుగాని."

రామం అయిష్టంగానే వుత్తరం పట్టుకుని వెళ్ళిపోయాడు.

కాంతమ్మ వూరుకోలేకపోయింది. "పాపం వాడు అన్నానికి పీట మీదకూడా కూర్చున్నాడే! పోస్టు వెళ్ళిపోతేమాత్రం అంత అర్జంటేమిటి? రేపు వెళ్ళదూ?" అంది కొంచెం కోపంగా.

పద్మ జవాబు చెప్పలేదు.

రామం తిరిగివచ్చి అన్నం తింటోంటే పద్మ పదిపైసలుతెచ్చి ఇవ్వబోయింది. కాంతమ్మకి కళ్ళనిండా కోపం వచ్చేసింది.

"పద్మా! ఏవిటే ఆపనీ? ఉత్తరం పట్టుకెళ్ళాడని డబ్బులిస్తావా? మంచిదానివే? ఎవడయినా వింటే నవ్వేపోతాడు" అంది.

"అదికాదమ్మా! పాపం వాడి కిస్తానని ఆశపెట్టానే!"

"ఆశాలేదు, సింగినాదంలేదు. వాడికొక్కావాలంటే నే నిస్తాలే".

పద్మ గదిలోకెళ్ళి పదిపైసలూ పర్సులో పడేసుకుంది.

పద్మ వచ్చినప్పట్నుంచీ — దాని గోళ్ళకున్న ఎర్ర రంగు వింతగా చూస్తోనేవుంది శకుంతల.

"అక్కయ్యా! ఇదెలా వేసుకున్నావే?" అంది చాలాసార్లు.

"మీ బావ వేశారు. నే వేసుకోలా" అని జవాబు చెప్పింది పద్మ గర్వంగా. పద్మ తల దువ్వుకుంటోంటే — దాని తోలు బొట్టుపెట్టెలో గోళ్ళరంగు సీసా చూసేసింది శకుంతల.

"అక్కయ్యా! ఇదేమిటే!" అంది సంబరంగా దాన్ని పైకితీస్తూ.

పద్మ వూళ్ళాక్కుని లోపల పెడుతూ — "చిన్నపిల్ల కెందుకే గోళ్ళరంగూ?.... అయినా నాకు వెయ్యటం రాదు" అని పెట్టి మూత పెట్టేసింది.

శకుంతల తల్లి దగ్గర కెళ్ళిపోయింది— "అమ్మా! అక్కయ్య పెట్లో గోళ్ళరంగు సీసా వుందే."

"ఏం నీకు వేస్తానందా?"

"ఉహూ: వెయ్యనంది."

కాంతమ్మ కూతుర్ని దగ్గిరికి తీసుకుంది. "పోనీలేమ్మా! నీకో సీసా తెమ్మని అన్నయ్యకి చెప్తాలే. తప్పకుండా తెమ్మని చెప్తాను. నువ్వేం బాధపడకేం? వెళ్ళు ఆడుకో. కొంచెం బఠానీలు తీసుకు వెళ్ళిపో" అంటూ మాట మరిపించబోయింది.

శకుంతల వెళ్ళినట్టే వెళ్ళి కాస్సేపటికి మళ్లా వచ్చింది. కాంతమ్మ మొహంమీద చేతులాడిస్తూ నవ్వింది.

"తిలకం రాసుకున్నానమ్మా! భలే బావున్నాయికదూ నా గోళ్ళు?"

కాంతమ్మ ఒక్క క్షణం వాటికేసి చూసి — చటుక్కున చేతులు ముడుచుకుంది—"ఎంత బావున్నాయో పిచ్చిముండ చతులు. నీకూ కూడా మొగుడొస్తే సరి. వాడే తెస్తాడు గోళ్ళ రంగులూ ... వేళ్ళరంగులూను". శకుంతల సిగ్గుపడిపోయి పరిగెత్తుకు వెళ్ళిపోయింది.

◆ ◆ ◆

అన్నానికి రాకుండా అరగంటనుంచీ లెక్కలతో తన్నుకుంటోంది శకుంతల— "వెధవ లెక్క .... రావటంలేదు" అని బిక్కమొహం వేసింది.

"శకుంతలా! అన్నం పెట్టేశానే!" అని అరుస్తోనే వుంది కాంతమ్మ.

శకుంతల వినిపించుకోకుండా పుస్తకం పట్టుకొని పద్మ దగ్గరికి వెళ్ళింది — "అక్కయ్యా! కొంచెం ఈ లెక్క చెప్పవే! నాకు చేత రావటంలేదు" అంది పక్కన కూర్చుంటూ.

పద్మ రాస్తోన్న వుత్తరం మూసేసి — "నా కిప్పుడు ఖాళీలేదు. ఉత్తరం రాసుకుంటున్నాను. తర్వాత చెప్తాలే" అంది చిరాకుపడుతూ.

"కాదక్కయ్యా! ఇప్పుడు చేసి తీసికెళ్లాలి. లేకపోతే మేష్టారు కొడతారు. ఒక్క లెక్క కూడా సరిగ్గా రావటంలేదు."

"అబ్బబ్బ! పోదూ! రోజూ ఎలా చేసుకుంటున్నావు? తొందరగా బళ్ళో కెళ్ళిపో! కమలా వాళ్లెవరయినా చేసుకొచ్చారేమో ఎక్కించుకో" విసుక్కుంది పద్మ.

"శకుంతలా! తిండి తినమంటే పూడిపడవేమే?" అంటూ వచ్చిన కాంతమ్మ చిన్నకూతురి అవస్థంతా చూసింది.

"వెధవలెక్క అదేం లెక్క తల్లీ నీ ప్రాణానికి? ఇలారా! కూడికలేనా? నా కొస్తుందేమో చూస్తానిలారా!"

"కూడికలు కావమ్మా! వడ్డీలెక్క. ఒక ఉద్యోగస్తుడు 1600 రు. లు, అప్పుతెచ్చి ఇల్లు కట్టించెను. నెలకు నూటికి రూపాయిన్నర చొప్పున 15 సంవత్సరములకు ఎంత వడ్డీ అగును?" అని చదివి ఏడుపు మొహం పెట్టింది శకుంతల.

"సరి. మన బతుకులాగే వుంది వాడి బతుకూను. అంత అప్పు తెచ్చి ఇల్లు కట్టించకపోతేనేం....? నెలకు నూటికి రూపాయిన్నరా, పదహారు వందలకా? .... ఎనిమిదీ .... ఇరవయి నాలుగు రూపాయలు సంవత్సరానికి.... 15 సంవత్సరాలకా?".... తలా ఓ పావుగంటా అటూ ఇటూ ఆడించి 360 రు. లని రాసుకోవే – అని చెప్పేసింది కాంతమ్మ విజయగర్వంతో.

"ఊహూ! అలా కాదమ్మా! లెక్కంతా ఎలా చేశామో చూపించాలి" అసంతృప్తి ప్రకటించింది శకుంతల.

"ఎలా ఏవిటి? నోటో చేసుకుంటాం. ముందు నువ్వు లేచిరా అన్నానికి.... పోనీ పద్మా! ఓసారి దానికా లెక్క చెప్పరాదుటే? మొన్ననేగా ఉత్తరం రాసిందీ? మళ్లా ఏవిటే రాస్తున్నావ్?"

పద్మ పెన్నుతో అరచేతిలో బొట్లు పెట్టుకుంటూ నసుగుతూ అంది— "వెళ్ళగానే మా అత్తగారు వుత్తరం రాయమన్నారు. మొన్న రాసింది ఆవిడక్కాదు."

"సరి. అప్పుడు భర్తగారికీ, ఇప్పుడు అత్తగారికీనా? బావుందమ్మా? నువ్వు అత్తారింటికెళ్తోంటే వెళ్ళగానే వుత్తరం రాయమని నేను మాత్రం చెప్పలేదూ? రాశావా? ఎప్పుడో రెన్నెల్లకో కార్డుముక్క హరి స్కూలు ఫైనల్ పరీక్ష పాసయ్యాడని రాస్తే జవాబన్నా ఇచ్చావా? నువ్వొత్త

రాస్తావని ఎన్నాళ్లెదురుచూశాడూ?" అని నాలుగూ అనేద్దామా అనిపించింది.

తన పెద్దతనం చిన్నబోవటం యిష్టంలేక శకుంతలకి అన్నం పెట్టే నెపంమీద గిర్రున తిరిగి వెళ్ళిపోయింది కాంతమ్మ.

పద్మ వున్న వారం రోజులూ నిప్పులమీద నించుంది. ముళ్ళమీద కూర్చుంది. ఓ మాటా మంచీ లేదు. కష్టం సుఖం లేదు, ఫక్కుమని నవ్విన పాపాన పోలేదు. ఆర్నెల్ల తర్వాత ఆడబిడ్డ ఇంటికి వచ్చిందన్న సందడేమీ లేదు. అసలు ఇంట్లో కళేలేదు. కాంతమ్మ మనస్సు పరిపరి విధాల పోయింది. నోరు తెరిచి మొగుడితోకూడా ఒక్క ముక్క చెప్పలేదు.

ఆవాళ పద్మ ఒంట్లో బాగాలేదని లేవలేదు. కాఫీ తాగి కక్కేసుకుంది— కాంతమ్మ గాభరా పడిపోయింది — "అమ్మా! పద్మా ఎలా వుందే నీకూ?" మంచం దగ్గిరికెళ్ళి మెత్తగా అడిగింది.

"కొంచెం తలనొప్పిగా వుందమ్మా! అంతే."

"పోన్లే ఓసారి డాకరుగారి దగ్గిరికెళావా? నాన్న జాగరగా తీసికెళారు." రామ్మూర్తి కూడా సిద్ధపడాడు ఆఫీసుకి శెలవుపెట్టి ఆస్పత్రి కెళ్ళటానికి.

పద్మ ఒప్పుకోలేదు. "ఉహూ: ఇక్కడ మందు లేవీ పుచ్చుకో వద్దని ఆయన చెప్పారు. అక్కడ మాకు తెలిసిన లేడీ డాక్టరు దగ్గిర మందులు వాడుతున్నాను. వికారప్పెడితే వేసుకోమని మాత్రలిచ్చింది. అవి అయిపోయాయి. ఫర్వాలేదులే. అక్కడికెళ్ళిపోయాక మళ్లావాడతాను.

"అదేవిటే? వారం అన్నా అవ్వలేదు. నువ్వసలు వచ్చినట్టేలేదు. పోనీ ఆ మాత్రలేవో ఈవూళ్ళో డాక్టరు రాసివ్వడూ?"

"అయినా వారం రోజుల్లో వొచ్చెయ్యమని ఆయన చెప్పారు."

కాంతమ్మ కేమనాలో తోచలేదు—"సరేలే! ఇంకో నాలుగురోజులు పోయాక వెళుదుగాని-ఎలాగూ ఏడో నెల్లో తీసుకురావాలి. పోనీ ఈ నాల్గు నెలలూ అక్కడే వుండు. నీ మనసూ బాగాలేదు" అంది ఓదార్పుగా.

పద్మ తటపటాయించి చెప్పలేక చెప్పలేక చివరికంది "ఏడో నెల్లో వాళ్ళు పంపిస్తారో లేదో."

"ఎవర్ని? నిన్నా? పంపించక పోవటం ఏమిటి, మరి పురుడో?"

"అక్కడే అయితే బావుంటుందని మా అత్తగారంటున్నారు."

తెల్లబోయింది కాంతమ్మ— "ఇదేం చోద్యమే?....పుట్టింటివాళ్ళం వుండగా .... అక్కడ పురుడోసుకోవడం ఏమిటి! రేపు మీ అత్తగారు తన కూతుర్ని అలాగే వదిలేస్తుందా? మరి నువ్వేమన్నావూ?"

"ఏమో! నాకేం తెలుసూ? ... అసలా డాక్టరమ్మ తన ఆస్పత్రిలో పురుడు పోసుకోకపోతే వైద్యమే చెయ్యదుట."

"మరీ మంచిది. దాని వైద్య మెవడిక్కావాలి? డాకర్లకేం కరువా?"

పద్మ మాట్లాళ్లేదు.

కాంతమ్మే అంది— ఓ నెల్లాళ్ళముందే అత్తయ్యని పిలిపించి నీకా చెంబెడునీళ్ళూ—పోసేసి - తల్లి ని పిల్లనీ లక్షణంగా ఏ మూడో నెల్లోనో పంపేద్దామనుకుంటున్నాను బావుందమ్మా! మీ అత్తగారి కబురే బావుంది" రెండు ముక్కలూ అనేసిందిగానీ— ఇంకా మనసులో దుగ్ధ తీరనేలేదు కాంతమ్మకి.

పద్మ కొంచెం నవ్వు మొహంతో ఆరిందాలా అంది—"అన్నాళ్ళు నేను లేకుండా ఆయన వుండలేరుట. అందుకే ఆయన అక్కడే వుండ మంటున్నారు." కాంతమ్మకే సిగ్గేసింది. లేచిపోయింది.

సాయంత్రం రామ్మూర్తి వచ్చాక, కాఫీ అదీ అయ్యాక కడుపులో ముక్క కాస్తా వెళ్ళ గక్కేసింది — "చూశారా, పద్మేమంటోందో?" ప్రారంభించింది—"అసలు దానికి నెల తప్పిందన్న ముక్కే రాశావు

కాదు. పోనీలే అని సరిపెట్టుకున్నాం. ఈ చోద్యం చూశారా? కోడలికి అత్తగారు అక్కడే పురుడు పోస్తుందట."

"అక్కడ డాక్టరమ్మ వుందిట. మందులవీ యిస్తోందట. మరి అంత గొప్పగా మనం చేయించగలమా?" అప్రయత్నంగా కాంతమ్మ కళ్ళలో నీళ్ళూరాయి. రామ్మూర్తి మనస్సు విలవిల్లాడింది.

నచ్చచెప్తోన్నట్టు చూశాడు—"ఛ! ఏమిటా దుఃఖం? పిచ్చిగానీ ఇప్పుడే ఏమైపోయిందనీ? మనం కాదంటే వాళ్ళుమాత్రం చెయ్యొచ్చారా? పోనీ వాళ్ళకెలా బావుంటే అలా చేసుకోనీ! ఇప్పుడు మనకేం లోటొచ్చింది?"

"లోటా? వల్లకాడా? గతిలేక పిల్లని పురిటికి తీసుకురాలేదని నలుగురూ నవ్వరా? అయినా పెద్దపిల్లకి తొలిచూరి పురుడు మన గుమ్మంలో జరగవద్దా? వాళ్ళూ మనం సంప్రదించుకుని అక్కడ పురుడుపోస్తే అది వేరుమాట. పోనీ అలా చేద్దామన్నా మనల్ని మాటమాత్రమైనా అడిగారా?"

"సరేలే! ఏదో ఒకటవుతుంది. పద్మ 'ఏం'టే మనసు కష్టపెట్టుకుంటుంది" అంటూ సర్దేశాడు రామ్మూర్తి.

కాంతమ్మ కళ్ళు తుడుచుకుని లోపలి కెళ్ళబోతోంటే రామూ వెక్కి వెక్కి ఏడుస్తూ వచ్చి కావలించుకుని బావురుమన్నాడు.

"ఏవిట్రా? ఏమైందిరా?" వీపు రాస్తూ అడిగింది తల్లి.

వాడు ఎక్కిళ్ళు ఆపి చెప్పేంతలోనే పద్మ రిస్టువాచీ చేతిలో అటూ ఇటూ తిప్పుతూ—"చూడమ్మా! ఈ వెధవేం చేశాడో! మొహం కడుక్కువద్దామని వాచీ పెట్టెమీద పెట్టి వెళ్ళా. వచ్చేప్పటికి చేతికి కట్టుకుంటున్నాడు. నన్ను చూసి కంగారుపడి దబ్బున ఎత్తేశాడు. ఏమైందో ఏవిటో! అద్దం పగిలితే ఏవయ్యేది చెప్పు? వెధవని తగలనిచ్చాను" అంది వాచీ తనిఖీచేస్తూ.

కాంతమ్మ మనస్సు వుడికిపోయింది. అలాగే నించుని ఎగాదిగా చూసింది కూతుర్ని.

"అక్కయ్యా! నాకోసారి వాచీ కట్టవ్....ఒక్కసారి....ఎక్కడికీ వెళ్ళనక్కయ్యా! ఒక్కసారి పెట్టుకొని తీసేస్తా" అంటూ శకుంతలా, రామం ఎప్పట్నుంచో అడుగుతున్నారు.

శకుంతల పోరు పడలేక వోసారి దాని చేతికి కట్టింది పద్మ.

అది మురిసిపోతూ ఇల్లంతా తిరిగి అందరికీ చూపించింది.

"చాల్లే! ఏ తలుపుకో తగిలించేస్తావ్! పాడౌతుంది" అని అప్పుడే తీసేసి తన చేతికి పెట్టేసుకుంది పద్మ.

శకుంతలకి తృప్తి లేకపోయినా వాచీ తన చేతికివున్న మధుర క్షణాల్ని గుర్తుచేసుకుంటూ బయటకెళ్ళిపోయింది, తర్వాత అదే చెప్పింది తమ్ముడితో—"ఇందాక అక్కయ్య నాకు ఎంచక్కా వాచీ పెట్టింది. ఎంత బాగున్నానో తెలుసా? అబ్బా: అచ్చంగా అక్కయ్యలా వున్నాను. నా చెయ్యి మరీ బాగుందిలే" అంటూ వాణ్ణి తెగ వూరించింది. రామం పుట్టెడుత్సాహంతో పద్మ దగ్గిర కెళ్లాడు- "పెద్దక్కా! ఇందాక చిన్నక్కయ్యకి....నీ వాచీ .... పెట్టావుకదూ? .... నాకూ ఒక్కసారి పెట్టవా?" అన్నాడు దీనంగా.

"నీ చేతికి బెల్టు లూజయిపోతుందిరా! వాచీ కిందపడిపోతుంది" అంది పద్మ.

"ఏదీ ఒక్కసారి చూస్తాను. మళ్లా నీకే ఇచ్చేస్తాను" వదల్లేదు వాడు. పద్మకి చిరాకేసింది "చెప్తోంటే వినవేం? అదికాస్తా బద్దలు కొడితేగానీ నీ ప్రాణం ఊరుకోదు. వెధవ్వేషం" అంది విసుక్కుంటూ.

రామం బిక్కమొహం వేసుకు వెళ్ళిపోయాడు. అదంతా కాంతమ్మకి తెలుసు. కాంతమ్మ వాణ్ణి ఓదార్చింది కూడాను. అయినా వాడు వుత్సాహం చంపుకోలేక వాచీ ముట్టుకున్నాడంటే .. ఆవిడకు దుఃఖం వచ్చేసింది.

పద్మ చిన్నవాళ్ళిద్దర్నీ ఎంత గారాంగా చూసేదో- వాళ్ళ చదువు సంధ్యల గురించి ఎంత శ్రద్ధ చేసేదో, కాంతమ్మకి కళ్ళలో కట్టినట్టుంది

వాళ్లెప్పుడయినా చదవకపోయినా, చిలిపితనాలు చేసినా చితకబాదేది. అప్పుడు అమ్మకీ–అక్కకీ తేడా అనేది లేదు. కాంతమ్మకెలాంటి బాధా కలగలేదు.

ఇప్పుడు పద్మ రామాన్ని కొట్టిందంటే కాంతమ్మ మనసు గింజుకు పోయింది — "నీ వాచీ నువ్వు దాచుకోలేక పోయావా? వాడి ఒంటిమిద దెబ్బెందుకేశావు?" అని దెబ్బలాడా లనిపించింది.

"పోనీలే! వూరుకోమ్మా. నీ అక్కయ్యే కదా ఓ దెబ్బవేసింది. అయినా దాని వస్తువెందుకు ముట్టుకున్నావు? ఎంత ఖరీదుపెట్టి కొను క్కుందో ఏమిటో? అది పోతే మనం తెప్పించి యివ్వగలమా ఏమ న్నానా?" అంటూ కొడుకునే మందలిస్తూ ఓదార్చింది.

వాడు తల్లి కుచ్చెళ్ళలోంచి మొహం పైకెత్తి బుగ్గ చూపించాడు. ఎడం బుగ్గమీద వేళ్ళతో గట్టిగా నలిపిన గుర్తులు రక్తం కూడుకుని పొంగి ఎర్రగా కనిపించాయి.

"ఒసే పద్మా! కొడితే ఓ దెబ్బ కొట్టాలిగానీ ఏమిటే ఈపనీ? వీపంతా వుండగా ...చంటి వెధవ పాలబుగ్గే దొరికిందా నీకు?" అంది కాంతమ్మ కోపాన్ని అణుచుకుంటూ నిష్ఠూరంగా.

పద్మ మాట్లాడలేదు.

* * *

పద్మకి మూడో వుత్తరం వచ్చింది మొగుడు దగ్గిర్నుంచి — వచ్చెయ్యమనీ —వాళ్ళమ్మకూడా వచ్చెయ్యమని చెప్పమందనీ.

"అమ్మా! నేను రేపే వెళ్ళిపోతాను" అంది పద్మ అన్నంతింటూ.

తెల్లబోయింది కాంతమ్మ — "అదేమిటే? రేపే?"

"ఆయన వుత్తరం రాశారు. మా అత్తగారు కూడా వచ్చెయ్య మన్నారుట."

కాంతమ్మకి అరికాలి మంట నెత్తికెక్కింది.

"కన్నతల్లిని, నా మాటంటే పిసరంతైనా గురిలేదు గానీ — అత్తగారత్తగారంటూ అలా పడి కొట్టుకుంటావేం?" అనెయ్యబోయి తమాయించుకుంది.

"సరే! నీ యిష్టం. అలాగే వెళ్ళు" అనేసింది.

పద్మ అన్నంతిని లేచి పెట్టీ బేగూ సర్దేసుకుంది. మర్నాడు పొద్దుటి బండికి వెళ్ళిపోతానని ప్రయాణం స్థిరం చేసేసింది.

"పోనీ సాయంత్రం వెళ్ళకూడదుటే? ఏవైనా చేసి యిస్తాను. ఇప్పటి కిప్పుడెలా వస్తాయి? సాయంత్రం నాన్న వచ్చి బజారుకెళ్లాలి. ఇంట్లో పంచదారా లేదు. మైదాపిండీ లేదు."

"ఎందుకూ? నాకేం వొద్దు. మా ·యింట్లో ఏవేవో చేస్తోనే వుంటారు."

"బావుందమ్మా మీ ఇంట్లో చెయ్యరనా నే ననేది? పుట్టింటినుంచి వెళ్తోన్న పిల్లవి .... కాస్త ఏదయినా తీసికెళ్ళకపోతే ఏం బావుంటుందీ? పాకుండలు చెయ్యనా?"

"ఒద్దు బాబూ! మా అత్తగారు నవ్వుతారు."

కాంతమ్మకి చెంపమీద కొట్టినట్టయింది.

"నవ్వితే నవ్వేందిలే. గొప్ప గొప్ప వంటలు నాకు చేతకావు. చెప్పుల్లో కాళ్ళు పెట్టుకూర్చున్నావు నువ్వు. పోనీ కొంచెం శనగపిండి వుంది కారప్పూస చెయ్యనా?"

"ఒద్దమ్మా! మా ఆయన తియ్యటివేకానీ - కారం తినరు."

"అయితే బూందీ దూసి, వుండలు చుడతాను."

"బెల్లం వొద్దు సుమీ! పంచదార వెయ్యి."

కాంతమ్మ ఓ గంట పంచదార అప్పుకోసం తిరిగి ఎలాగో సంపాదించి తీసుకొచ్చింది. జానకిని సాయంపిలిచి మిఠాయిచేసి తాటాకుబుట్టలో సర్దిపెట్టింది.

"గాజులూ — రిబ్బనులూ—అవీ- ఏవన్నా కావాలిటే పద్మా! సాయంత్రం నాన్నకి చెప్పి తెప్పిస్తాను" అంది నడుం వాలుస్తూ.

"ఉహూ! నా దగ్గిర చాలా వున్నాయి. కావాలంటే అక్కడే కొనుక్కుంటాలే" అంది పద్మ గదిలోంచి-పెట్టె మళ్లా సర్దుతూ.

ఊరుకుంది కాంతమ్మ.

శకుంతల బళ్లోంచి రిబ్బనెక్కడో పారేసు కొచ్చింది.

తల్లి తిడతుందేమోనని జడుస్తూనే చెప్పింది. కాంతమ్మ కేక లెయ్యలేదు. దారం ముక్క కట్టింది జడకు.

"అమ్మా! అక్కయ్య దగ్గిర గాజుపెట్టెలో బోలెడు రిబ్బన్లున్నాయమ్మా! ఒకటి అడగనా?" అంది ఆశగా శకుంతల.

"ఒద్దు. అవి ఇవ్వాలేగానీ నువ్వలా అడక్కూడదు. నా దగ్గిర పెట్లో కొత్త రిబ్బనుంది. రేపు వేస్తాలే. ఈ పూట కిలా వుండనీ!" అంటూ లేచింది కాంతమ్మ.

పద్మ వెళ్ళిపోతున్న కబురు సాయంత్రం తండ్రికి తెలిసింది. "అదేవిటి? అప్పుడే?" అన్నాడాశ్చర్యంగా.

పెళ్లాం చెప్పినా వినకుండా కూతుర్ని అడిగాడు- "అదేవిటమ్మా! అంత తొందరేవిటి? పదిరోజులన్నా అవందే?"

"ఉత్తరం వచ్చింది. రమ్మని రాశారు మరి" అంది పద్మ నేల చూపులు చూస్తూ.

"పోనీ అతనికి నేను జవాబు రాస్తాను. ఇంకో వారంరోజు లుండరాదమ్మా!" అన్నాడు తండ్రి అభిమానం వుట్టిపడుతోంటే.

పద్మ మాట్లాడలేదు.

కాంతమ్మ అందుకుంది – "దాన్ని వెళ్ళనివ్వండి? దానింటికది వెళుతుంది. ఎన్నాళ్ళుంటుం దిక్కడ?" అంది నిర్మొహమాటంగా.

రామ్మూర్తి ఇక తర్కించలేదు. "అయితే హరిని తీసికెళ్ళమ్మా! మళ్లా వచ్చేస్తాడు" అన్నాడు.

"ఎందుకూ? అక్కర్లేదు. ఒక్కదాన్ని వెళ్ళిపోగలను."

"వెళ్ళలేవని కాదు. తోడెవర్నయినా పంపితే బావుంటుంది.

వచ్చేప్పుడు మీ ఆయన వస్తాడని వూరుకున్నానుగానీ—లేకపోతే తీసుకు రావటానికి హరి వచ్చేవాడే."

"ఫర్వాలేదు నాన్నా! మా వాళ్ళేమీ అనుకోరు, ఎందుకూ అనవస రంగా రానూ..... పోనూ...."

"అది వెళ్ళాను మొర్రో అంటోంటే మీరేవిటి మధ్య? ఇప్పుడు దీన్ని దిగబెట్టడానికి వాడికి మాత్రం ఖాళీ ఎక్కడుంది? వాడి చదువో?" కస్సుమంది కాంతమ్మ. రామ్మూర్తి వూరుకున్నాడు.

మర్నాడు చీకట్నే యింట్లో వాళ్ళంతా లేచారు.

కూతురు మొహాన్న బొట్టుపెట్టి—చీరా రవికల గుడ్డా పెట్టింది తల్లి. ఆవిడ మనసు ఆ క్షణంలో అమృత భాండంలా ప్రేమతో నిండివుంది—

"గండం గడిచి పండంటి బిడ్డనెత్తుకుని పది కాలాల పాటు సుఖంగా వుండు తల్లీ!" అనుకుంది కడుపులో.

పద్మ పర్సులోంచి చిల్లరడబ్బులు తీసి చిన్నవాళ్ళిద్దరికీ కొనుక్కో మని యివ్వబోయింది. వాళ్ళిద్దరూ పుచ్చుకోలేదు.

"అక్కయ్య ఇస్తోంది. తీసుకోండర్రా!" అంది కాంతమ్మ. ఇద్దరూ పుచ్చుకున్నారు.

పద్మ బండి ఎక్కింది. హరి రైలు ఎక్కించటానికి స్టేషన్ కెళ్ళాడు. అప్పటికి పొద్దు పొడుస్తోంది. వంటయినా మొదలు పెట్టలేదు కాంతమ్మ. దిగులుగా భర్త దగ్గర కూర్చుంది.

రామ్మూర్తి మాట్లాడకుండా ఏవిటో ఆలోచిస్తూ కూర్చున్నాడు. "ఎందుకలా ముభావంగా కూర్చున్నారు?" అంది కాంతమ్మ పలకరిస్తూ. "ఆఁ ఏవుందీ? పద్మతల్లి చాలా మారిపోయిందే!"

"మారనివ్వండి. మనదేం పోయింది?" బరువుగా పలికింది కాంతమ్మ కంఠం. ఆవిడ బాధ రామ్మూర్తి ఏనాడో గ్రహించాడు. ఓదార్పుగా అన్నాడు—"పిచ్చిదానా! ఆడపిల్లలు మారిపోరుటే?"

"మీకే పిచ్చి! ఆడపిల్లలే మారరు. వాళ్ళకి తల్లీ తండ్రీ అన్నా

తమ్ముడూ అన్న అభిమానాలుంటాయి. ఎన్నేళ్లొచ్చినా పుట్టింటికి రావటం అంటే మురిసిపోతారు. అత్తారింట ఎంత అంతస్తులమీదకెక్కినా పుట్టింట్లో పురిసెడు గంజినీళ్ళయినా తాగాలనుకుంటారు. కానీ—ఇది చూశారా? వున్నం వారం రోజులూ ఎలా గింజుకుపోయిందో! పోనీలెండి. అది మొగుడి దగ్గిరే పుట్టి పెరిగింది" కాంతమ్మ కంఠం రుద్ధమైపోయింది. కన్నీళ్ళు వుబికి వచ్చాయి.

"చాల్లే! ఏవిటా చాదస్తం. అది చిన్నదీ? నువ్వు పెద్దదానివీనూ. అంతమాత్రం అర్థం చేసుకోకపోతే ఎలా కాంతం? ఏదీ? దాని కింకా కొత్త! వాళ్ళకేం కోపం వొస్తుందోనని దానిభయం" అంటూ రామ్మూర్తి కొంచెం నవ్వి— "నువ్వుమాత్రం కొత్తలో మీ నాన్న తీసికెళ్ళటానికొస్తే బిక్కమొహం వేశావు కదూ" అన్నాడు.

"వెళ్ళటానికి కొంచెం కష్టం వేస్తే మాత్రం — మా అమ్మనీ, తోడబుట్టినవాళ్ళనీ, మా ఇంటినీ చూసీ చూడగానే అంతామర్చిపోయాను. అసలు నాకో మొగుడున్నాడన్న మాటకూడా మర్చిపోయాను. పిల్లలు పుట్టేవరకూ నాకు పుట్టింటి ధ్యాస పోనేపోలేదు. పద్మ కదేవన్నా వుందా? ఆర్నెల్లయిందో లేదో ఎవరో పరాయి వాళ్ళింటి కొచ్చినట్టు మసిలింది. కన్నెత్తి చూసిందా? పన్నెత్తి పలకరించిందా? సరేలెండి. దానికిలేనిబాధ మనకు మాత్రం ఎందుకూ?"

"ఇప్పుడిలాగే అంటావు. పదిరోజులు పోతే సరి. పద్మ ఎలా వుందో, ఏం చేస్తుందో అంటూ కలవరింతలు మొదలెడతావు."

కాంతమ్మ కడుపులోవున్న కాఠిన్యం అంతా పైకి వచ్చింది — నిరభిమానంగా అనేసింది. "దానికోసం ఇక మనం కలవరించక్కర్లేదు. దాని మొగుడున్నాడు. అత్తగారుంది. నౌకర్లున్నారు. చాకర్లున్నారు. దాని కేంలోటు? పదివేలకీ అలా వుండాల్సిందే. అమ్మ వుంది–నాన్న ఉన్నాడు–తోడబుట్టినవాళ్ళున్నారు. అని దాని కెప్పటికయినా జ్ఞాపకం రావాలి గానీ

దాని కబురు నా నోటితో అంటానేమో చూడండి. కన్నాం – పెంచాం– పంపించాం. ఇంకా దానికీ మనకూ ఏం సంబంధం? మిగిలిన వాళ్ళని చూసుకోవాలి. మనల్ని నమ్ముకున్న వాళ్ళే మన బిడ్డలు.

"వాళ్ళు మాత్రం మీరిపోరుటే? అడ్డాలనాడు బిడ్డలే గానీ .... గడ్డాలనాడు బిడ్డలా?"

"పోనీ అలాగే మారిపోనివ్వండి. అమ్మా నాన్నా అక్కర్లేని బిడ్డలు మనకుమాత్రం ఎందుకూ? మనమిద్దరమే వుందాం. మీకు నేనూ .... నాకు మీరూను .... అంతకన్న ఏ భోగ భాగ్యాలూ .... ఏ ముద్దు ముచ్చట్లూ అక్కర్లేదు మనకి. మనవేఁ వుందాం" తేలికపడ్డ మనస్సుతో కాంతమ్మ లోపలి కెళ్ళిపోయింది.

(డిశెంబరు 1967 యువ జ్యోతి నుంచి)

—(০)—